‘బడి’ పనులు పూర్తయ్యేనా.?

- ఆలస్యమవుతున్న మన ఊరు మన బడి పథకం
- విద్యార్థుల దరిచేరని సౌకర్యాలు
- ముస్తాబాద్‌లో మొదలుకాని మన ఊరు మనబడి పనులు
- విద్య సంవత్సరం ముగుస్తున్న పూర్తికాని పనులు



ప్రహరీ లేని ముస్తాబాద్ జెడ్పీ బాలికల పాఠశాల



బందనకల్ జెడ్పీ పాఠశాలలో పునాదుల్లో డైనింగ్ హాల్

ముస్తాబాద్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మన ఊరు మనబడి కార్యక్రమం ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతోంది. విద్య సంవత్సరం ఆరంభంలో ప్రారంభించిన ఈ పథకం విద్య సంవత్సరం ముగిసే నాటికైన పూర్తవుతుందా అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల ఆలసత్వం, కాంట్రాక్టర్ల నిరుత్సాహం ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుకారుస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముస్తాబాద్ మండలంలో 12 ప్రాథమిక, 4 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఈ పథకంలో చేర్చారు.

ప్రభుత్వ లక్ష్యం ఇదీ..

ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా మన ఊరు మనబడి పథకాన్ని ప్రారంభించారు. పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి వ్యవస్థ, విద్యార్థులకు ఫర్నీచర్, విద్యుత్, అదనపు తరగతి గదుల నిర్మాణం వంటి పనులు చేపట్టాలి. వంట గదులు, ప్రహరీలు, భోజనశాలలు, హ్యాండ్‌వాష్ బేసిన్లు, మైనర్, మేజర్ పనులు, కలర్ పెయింటింగ్ పనులు చేయాలి. ఇప్పటికే స్వచ్ఛంద సంస్థల ద్వారా డెస్కులు పొందిన పాఠశాలల్లోని పనికి వచ్చే డెస్కులను సేకరించి, వసతులు లేని ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలి. ఎందుకు పనికి రాని ఫర్నీచర్, డెస్కులను వేలం వేసి వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ ఖాతాల్లో జమ చేయాలి. విద్యాభివృద్ధికి చేపట్టిన ఈ పనులు క్షేత్రస్థాయిలో అంత వేగంగా సాగడం లేదని తెలుస్తోంది.

ఇవీ సమస్యలు

➡ ముస్తాబాద్ జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలు వేర్వేరుగా ఉండగా ఈ రెండు పాఠశాలలను ఈ పథకంలో చేర్చారు. అయితే సీఎస్ఆర్ ద్వారా మోడల్ పాఠశాలను నిర్మిస్తుండడంతో మన ఊరు మనబడి నిధులను ఇక్కడ వెచ్చించడం లేదు.

➡ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల అవసరం ఉన్నప్పటికి పనులు మొదలు పెట్టలేదు.

➡ అంబేద్కర్‌నగర్ పాఠశాలలో ప్రహరీ నిర్మాణం చేస్తున్నారు. కలరింగ్, సంపు నిర్మాణాలు చేపట్టాలి.

➡ మోహినికుంట పాఠశాలలో గ్రీన్‌బోర్డు పనులు, డెస్కులు రావాల్సి వుంది.

➡ నామాపూర్ పాఠశాలలో కలరింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

➡ బందనకల్‌లో పనులు ఆలస్యం కాగా, ఎస్ఎంసీ చైర్మనే స్వయంగా రెండు రోజుల క్రితం డైనింగ్ పనులు మొదలుపెట్టారు. ఇక్కడ పాత భవనానికి మరోస్లాబ్ వేస్తామని అధికారులు అటువైపు వెళ్లడం లేదు. ఇంకా ఫ్యాన్లు ఫిటింగ్ చేయాల్సి వుంది. అదనపు గదులు అవసరం ఉండగా, గతంలో నిర్మించిన రెండు గదులు ఉండడంతో, మన బడిలో పనులు చేపట్టడం లేదు.

➡ ఆవునూర్, కొండాపూర్, వెంకట్రావుపల్లె, నామాపూర్ పాఠశాలల్లో కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనులను ఈ విద్యా సంవత్సరం ముగిసే నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ధరలు పెరిగాయని..

స్టీల్, ఇసుక, ఇటుక, సిమెంట్ ధరలు పెరగడంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయడానికి ముందుకు రావడం లేదని అంటున్నారు. ఎస్ఎంసీలు, సర్పంచులు ముందుండి పనులు చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు చేసినప్పటికీ. బిల్లులు ఆలస్యమవుతాయనే పుకార్లతో పనులు ఆలస్యం చేస్తున్నారని తెలుస్తోంది. పెరిగిన ధరలకు అనుగుణంగా పనులు చేస్తే ఇంకా మిగులు పనులు ఉంటాయని ఉపాధ్యాయులంటున్నారు. పలు పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీటి వసతి సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారు.

పనుల్లో వేగం పెంచాలి



మా పాఠశాలలో పనులు పూర్తిచేసేందుకు ఎవరు సరిగా స్పందించడం లేదు. మొన్నటి వరకు నీటి సమస్యలున్నాయి. అదనపు గదులు అవసరం ఉంది. చైర్మన్ సహకారంతో డైనింగ్ పనులు మొదలుపెట్టాం. మిగతా పనుల్లో వేగం పెంచాలి.
– కొనేటి రవి, ప్రధానోపాధ్యాయుడు, బందనకల్

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు



అందరినీ సమన్వయం చేస్తున్నాం. ధరలు పెరిగాయని పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. అధికారులకు ఎప్పటికప్పుడు నివేదిస్తున్నాం. పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను కోరుతూ, ఇతర శాఖల అధికారులతో మాట్లాడిస్తున్నాం. మరో 30 శాతం పనులు మిగిలి వున్నాయి. – విఠల్‌నాయక్, నోడల్ ఆఫీసర్

క్లుప్తంగా

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్లు

ఎల్లారెడ్డిపేట: తపాలా శాఖ అందిస్తున్న సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని మండల తపాలా శాఖ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని పదిరలో గురువారం తపాలా సేవలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ రికవరింగ్ డిపాజిట్, సుకన్య సమృద్ధి యోజన, గ్రామీణ తపాల జీవిత బీమా, పోస్టల్ బీమా పథకాలను తపాలా కేంద్రంలో అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రజలందరూ తపాల శాఖ కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలన్నారు. సమావేశంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ దయానంద్, సర్పంచ్ వజ్రమ్మ, ఎంపీటీసీ మల్లేశం, ఉపసర్పంచ్ సురేందర్, తపాల సిబ్బంది, పోస్టుమాస్టర్ కృష్ణమూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోనరావుపేటలో..

కోనరావుపేట: పోస్టల్ శాఖ అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవాలని జిల్లా పోస్టల్ అధికారి దయానంద్ కోరారు. గురువారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో బీమా పథకాలు, పొదుపు పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంతెన సంతోష్, పోస్టల్ అధికారి రావుల భూంరెడ్డి, బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వంద యూనిట్లకు ఉచిత విద్యుత్



సెస్ డైరెక్టర్ దేవరాజం

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ పరిధిలో విద్యుత్ సమస్యలను పరిష్కరించే దిశగా పని చేస్తానని నూతనంగా ఎన్నికైన సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం అన్నారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ రూరల్ మండలంలోని 17 గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీల వినియోగదారులకు నెలకు 100 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందజేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని తెలిపారు. అలాగే రైతులు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పాలిటెక్నిక్ కోర్సులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ రాజగోపాల్

గంభీరావుపేట: స్థానిక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సులు, పాలీసెట్ అంశాలపై గురువారం అవగాహన కల్పించారు. అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం అధికారి శ్రీదేవి, సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు రవికుమార్, వహీద్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో పాలిటెక్నిక్ కోర్సులు జీవనోపాధికి ఏ విధంగా దోహదం చేస్తాయో వివరించారు. ప్రధానోపాధ్యాయులు గంగారాం పాల్గొన్నారు.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడ: పట్టణంలోని లక్ష్మీపూర్, హన్మక్కపల్లి, లాలపల్లి, బాలానగర్, జయవరం, తిప్పాపూర్, కోనాయపల్లి ఏరియాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు సెస్ ఏఈ సుష్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహాశివరాత్రి జాతర ఉత్సవాల సందర్భంగా విద్యుత్ సరఫరా నిమిత్తం లైన్లు సరి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. సెస్ వినియోగదారులు సహకరించాలని ఆమె కోరారు.

నియామకం

గూడెం కాంగ్రెస్ కమిటీ

ముస్తాబాద్: మండలంలోని గూడెం కాంగ్రెస్ గ్రామ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా సడిమెల బాలయ్య, ఉపాధ్యక్షులుగా ఆమనగంటి నరేందర్, బొప్ప తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా చింత రాజం, కోశాధికారిగా గంగమద్ది సత్యానందం ఎన్నికయినట్లు తెలిపారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేత



విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న ప్రతినిధులు

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 68 మంది విద్యార్థినులకు మలబార్ గోల్డ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5.54 లక్షల ఉపకార వేతనాల చెక్కును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ పదో తరగతిలో వచ్చిన గ్రేడుల ఆధారంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి మెరిట్ ప్రకారం ఒక్కొక్కరికి సుమారుగా రూ.8 వేల నుంచి రూ.10 వేల ఉపకార వేతనాన్ని అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్, మలబార్ గోల్డ్ కరీంనగర్ స్టోర్ ఇన్‌చార్జి మహమ్మద్ షరీఫ్, విక్కీ, శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సకాలంలో అందించాలి

ఇల్లంతకుంట: అంగన్‌వాడీ కేంద్రాలకు నెల రోజుల నుంచి పాలు, గుడ్లు, పప్పులు సకాలంలో ఎందుకు సరఫరా చేయడం లేదని తెలంగాణ ఫుడ్ కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ ఐసీడీఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని అనంతగిరిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం సరైన సమయంలో అందకపోవడంపై వెంటనే పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి వారంలోగా నివేదిక ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరైన సమయంలో పౌష్టికాహారం అందకపోవడంతో లబ్ధిదారులు నష్టపోతున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు పెద్ద సైజు ఉండేవి అందించాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ చాంద్‌పాషా పాల్గొన్నారు.

క్రీడాకారులకు సౌకర్యాలు కల్పిస్తాం



మైదానాన్ని పరిశీలిస్తున్న గోపాల్‌రావు

ముస్తాబాద్: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు సిద్ధంగా ఉందని రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు అన్నారు. మోహినికుంటలో క్రికెట్ మైదానాన్ని అభివృద్ధి చేసేందుకు అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆటలను ప్రోత్సహించేందుకు ప్రతి గ్రామంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారన్నారు. నేడు తెలంగాణ నుంచి అనేక మంది క్రీడాకారులు వివిధ క్రీడల్లో రాణిస్తూ రాష్ట్రానికి పేరు తెస్తున్నారన్నారు. ఎంపీడీవో రమాదేవి, టెక్నికల్ అసిస్టెంట్ రమేశ్, శ్రీనివాస్‌రావు, సతీశ్, వేణుగోపాల్‌రావు, దేవయ్య, శ్రీనివాస్ అన్నారు.

కంటివెలుగు ప్రారంభం



ఎల్లారెడ్డిపేటలో కంటి పరీక్ష చేయించుకుంటున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



వేములవాడలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి

జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఇల్లంతకుంట మండలంలోని ఆరెపల్లిలో గ్రామ పంచాయతీ వద్ద, ఇల్లంతకుంటలో రైతువేదికలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రారంభించగా, ఎల్లారెడ్డిపేట, హరిదాస్‌నగర్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య శిబిరం ప్రారంభించి, కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఆయనకు 2.5 సైట్ ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. వేములవాడలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మిగతా మండలాల్లో ఆయా మండల ప్రజాప్రతినిధులు కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్లు వైద్యసిబ్బంది, నాయకులు పాల్గొన్నారు. పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన వారితో శిబిరాల వద్ద సందడి నెలకొంది. – సాక్షి, నెట్‌వర్క్

సోలార్ ఫెన్సింగ్ చేయించాలి

గంభీరావుపేట: మండలంలోని నర్మాల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయ ప్రాంగణం చుట్టూ కోతులు రాకుండా సోలార్ ఫెన్సింగ్ వేయించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తిరుపతి అధికారులను కోరారు. గురువారం పాఠశాలను సందర్శించి మాట్లాడారు. స్నానాలకు వాటర్ గీజర్లు నాణ్యమైన భోజనం, విద్య అందించాలని కోరారు. కాస్మోటిక్, మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు.

జాతరకు అంతా సిద్ధం



చీకోడులో శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయం

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం చీకోడులో ప్రసిద్ధిగాంచిన శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయం మాఘ అమావాస్య జాతర, రథోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈనెల 21 నుంచి మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవాలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. వందల ఏళ్ల క్రితమే చీకోడు శివారులో కొండపై స్వయంభుగా స్వామివారు వెలిశారని ఆలయ అర్చకులు నరసింహచార్యులు తెలిపారు. స్వామివారి ఊరేగింపు, విశ్వంక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, తిరుకల్యాణం ఉంటుందన్నారు. 22న రథోత్సవం, గిరిప్రదర్శన, ఎడ్ల బండ్ల ప్రదర్శన ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతర ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అలాగే రామలక్ష్మణపల్లెలో శ్రీరామాలయం ఆవరణ మానేరు తీరంలో జాతరకు ఏర్పాట్లు చేశారు. పోతుగల్‌లోని పురాతన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ గౌతంరావు తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్



నిరుపయోగంగా మరుగుదొడ్లు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఫలితంగా ప్రయాణికులు ఊపిరి బిగబట్టి బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. బస్టాండ్‌లోని మూత్రశాలల్లో నీటి వసతి లేకున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. బస్టాండ్ ప్రాంగణంలో మంచినీటి వసతి, మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: మనోహర్, ఆర్టీసీ డీఎం, సిరిసిల్ల:
ఫోన్ నెంబర్: 99592 25929

సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి సాధ్యం

- ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్
- బోయినపల్లి మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ వేణుగోపాల్

బోయినపల్లి: అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ అన్నారు. ఎంపీపీ వేణుగోపాల్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల సమావేశంలో ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, డీసీఎంఎస్ డైరెక్టర్ ముదుగంటి సరేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈజీఎస్ ఏపీవో వనం సబిత ఉపాధి హామీలో క్రీడాప్రాంగణాల పనుల ప్రగతి నివేదిక చదివారు. క్రీడా ప్రాంగణాల పనులకు సంబంధించిన బిల్లులు రావడం లేదని మాన్వాడ సర్పంచ్ రామిడి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీవో మాట్లాడుతూ మొదటి విడుత పనుల బిల్లులు వచ్చాయని, ఇప్పుడు చేపట్టిన పనుల బిల్లుల మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. ఎంఏవో ప్రణిత మాట్లాడుతూ మండలంలో పంటల నమోదు చేపడుతున్నట్లు వివరించారు. వరి నారు మడుల్లో మోగి పురుగు ఆశిస్తుందని నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. పశు వైద్యాధికారి రమేశ్ మండలంలో పశువులకు వేసిన టీకాల గూర్చి తెలిపారు. ఎంఈవో శ్రీనివాసదీక్షిత్ మన ఊరు – మన బడి అమలు తీరు వివరించారు. కంటి వెలుగు కార్యక్రమం సందర్భంగా పీహెచ్‌సీల వైద్యాధికారులు హాజరు కాలేదు. వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, పీఆర్ డీఈ సత్యనారాయణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగాలను భర్తీ చేయాలని బీజేవైఎం రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను బీఆర్ఎస్ ప్రభుత్వం భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై బీజేవైఎం నాయకులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు వారిని అడ్డుతొలగించారు. అనంతరం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. మండల యువమోర్చా అధ్యక్షుడు మెరుగు జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించకుండా మోసం చేసిందన్నారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ చేసే వరకు ఆందోళనలు చేస్తామన్నారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, కార్యదర్శి ఎలేందర్, సోషల్ మీడియా కన్వీనర్ వినయ్ పాల్గొన్నారు.

ఎస్సై దాతృత్వం

వేములవాడరూరల్: సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శివనగర్ కాలనీకి చెందిన శర్మ లావణ్య అనే మహిళ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న వేములవాడ రూరల్ ఎస్ఐ నాగరాజు వెంటనే 25 కిలోల బియ్యం, 5 వేల నగదును అందజేసి మానవత్వాన్ని చాటుకున్నాడు. ఈ నిరుపేద మహిళ భర్త, బిడ్డను కోల్పోయి ఒంటరిగా ఉంటోంది.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

వీర్నపల్లి: మండలంలోని భూక్య తండా గ్రామపంచాయితీ పరిధిలోని రాశిగుట్ట తండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఆడెపు సంపత్, అనితను సర్పంచ్ భూక్య భారతి సన్మానించి మాట్లాడారు. పాఠశాలలో చైల్డ్ చాలెంజ్, నా బొమ్మ నా ఇష్టం అనే కార్యక్రమాల ద్వారా మంచి బోధన అందిస్తున్నారన్నారు. మండల నోడల్ ఆఫీసర్ కే.రవి, కాంప్లెక్స్ సెక్రటరీ వెంకటరెడ్డి, సీఆర్‌పీ మహేందర్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.